# 9



# జుమ్మేకి రాత్ మే

## పెద్దింటి అశోక్‌కుమార్

అనంతమైన ఇసుక మైదానం. ఒంటరి పావురంలా ముడుచుకుని కూర్చుని ఉన్నాడు సలీం. అతని చేతిలోని లాప్‌టాప్ ప్రపంచాన్ని చుట్టి వస్తోంది. ఫేస్‌బుక్‌లో పేజీలు తిరుగుతున్నాయి. ఫాతిమా లాగిన్ అయినట్టుంది. ఫోటో ముందు గ్రీన్ సింబల్.

క్లిక్ చేసి, 'హాయ్... హౌ ఆర్యూ డియర్,' అని ఆతృతగా టైప్ చేశాడు సలీం.

'ఫైన్... ఆప్ కైసా హై,' క్షణాల్లో రిప్లయ్ వచ్చింది. బీడుబడ్డ నేలమీద వాన చినుకులు పడ్డంత పులకరింత.

'అచ్చా హై... నువ్వేట్లున్నవ్... ఏం చేస్తున్నవ్?'

'బాగున్న... నీ గురించే ఆలోచిస్తున్న.'

నొక్కుతున్నది ఫాతిమా చెక్కిళ్లే అన్నంత తన్మయత్వంలో కీ బోర్డును తాకుతున్నాడు సలీం. ఎడారిలో ఎడబాటులో ఒక సెల్‌ఫోన్, ఒక టచ్‌స్క్రీన్... ఓ కీబోర్డ్ ఓ నెట్‌కార్డ్ ఇవే సుఖదుఃఖాల... ఇన్‌పుట్, అవుట్‌పుట్.

"నేనూ అంతే... నీతోపాటు ఈరోజు హసీనా గురించి కూడా ఆలోచిస్తున్న. ఈరోజు దాని పుట్టిన రోజు..." టైప్ చేసి సెండ్ చేశాడు సలీం.

క్షణాలు, నిమిషాలు గడిచాయి. సమాధానం లేదు. నొచ్చుకున్నాడు సలీం.

'క్యా హువా... బీబీ... బాత్ బంద్ కరే!' టైప్ చేసి పంపాడు.

రిప్లయి లేదు కాని ఫోన్ మోగింది. ఫాతిమా అనుకుని ఆతృతగా ఎత్తాడు. కాదు కంపెనీ సూపర్‌వైజర్.

నీరసంగా, "సార్... నమస్తే," అన్నాడు.

'సలీం భాయ్... నమస్తే.. ఎంత చెప్పగూడదనుకున్నా గురువారం నాడే నీకు పని చెప్పాల్సి వస్తున్నది..." నసిగాడు సూపర్‌వైజర్.

సలీం కళ్లు ఫేస్‌బుక్ మీదున్నాయి. మనసు ఎక్కడో ఉంది. ఫాతిమా నుంచి రిప్లయికోసం చూస్తూనే, 'వీడో సొల్లుగాడు... సెలవు నాడు కూడా వదిలిపెట్టడు. ఏదో గిరాకి తగిలినట్టుంది,' అనుకుని, "ఏంజేద్దాం సార్... మన నౌకరే అసొంటిది గదా..."

ఆన్‌లైన్‌లో ఒకరిద్దరు మెసేజ్‌లలో పలకరిస్తున్నారు. బై చెప్పి క్లోజ్ చేశాడు సలీం.

"సలీంభాయ్... మిక్సింగ్ క్రషర్‌మిషిన్‌తో మస్కట్ వెళ్లాలి. బ్రామ్మిలో మన కన్‌స్ట్రక్షన్ వర్క్ నడుస్తుంది కదా అక్కడికి. ఒక స్లాబ్ పోసేదుందట. అక్కడి మిషన్ ఖరాబయిందట. రెండే గంటల పని. ఇంకోసారి చుట్టీ తీసుకుందువు గానీ..." సూపర్‌వైజర్ చెబుతున్నాడు.

సలీం ఆలోచనల్లో మాత్రం హసీనానే మెదులుతోంది. 'వీళ్లింకా ఆమెను క్షమించలేదా... అబ్బా అమ్మీ సరే! ఫాతిమా కేమయింది. అటు ఇటుగా ఇద్దరూ ఒక్క ఈడు వారేగదా... ఆమెను అర్థం చేసుకోలేదా...' అనుకున్నాడు. హసీనా గుర్తుకు రాగానే కన్నీళ్లు తిరిగాయి. ఫేస్‌బుక్ లాగవుట్ చేసి లాప్‌టాప్ మూసేశాడు.

"సలీంభాయ్... సప్పుడుజెయ్యవు... ఏమైంది...?" సూపర్‌వైజర్ రెట్టించి అడిగాడు.

సలీం తేరుకుని, "ఏంలేదు సార్... చెప్పండి. ఎప్పుడు వెళ్లాలి... ఎక్కడికి వెళ్లాలి," అడిగాడు తప్పదన్నట్టు.

"చెప్పితి గదా... బార్డర్ దాటి మస్కట్ వెళ్లాలి. బ్రామ్మిలో మన అపార్ట్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ దగ్గరికి. రాత్రి రిటర్న్ గావచ్చు..." బుజ్జగిస్తున్నట్టుగా చెప్పాడు.

సలీం టైం చూసుకున్నాడు. తొమ్మిది దాటింది. అప్పుడే ఎండ నిప్పులు కక్కుతోంది. దుబాయిలోని పుజీర నుంచి బార్డర్ దాటి బ్రామ్మి చేరుకోవడానికి కనీసం మూడుగంటలు. అదీ బార్డర్ సెక్యూరిటీ ఆప కుండా ఉంటే...

''సార్... ఇప్పుడే బయలుదేరుతా...'' లేస్తూ అన్నాడు సలీం.

''సలీం... ఒక చిన్న పని,'' నసిగాడు సూపర్‌వైజర్.

సలీం అనుమానం నిజమయింది. లోలోపల కోపంగా ఉన్నా పైకి మామూలుగా అడుగుతున్నట్టు, ''చెప్పండి సార్... ఎవరినైనా బార్డర్ దాటించాల్నా...'' అన్నాడు.

''అవును సలీం. మాకు దగ్గరి బంధువు. మస్కట్‌లో లేబర్ బతుకులు నీకు తెలుసుగదా. కూలీ దొరకక ఉపాసముంటున్నడట. దుబాయ్ వచ్చి ఏదో పని చేసుకుంటడట. రోజూ ఫోన్ చేసి సంపుక తింటున్నడు...'' ఎప్పుడు చెప్పే మాటనే చెప్పాడు.

'వీనికి పైసలిచ్చినోడల్లా దగ్గర బంధువే. బ్రోకర్ దందా చేసి రక్తం తాగుతుండు,' అనుకున్నాడు సలీం. వెంటనే 'కుదరదు' అని గట్టిగా చెప్పాలనిపించింది. కానీ అలా చెప్పినవారు వారంరోజుల్లోనే 'ప్యాకప్' అయి ఇంటికి వెళ్లిన సంగతి గుర్తుకు వచ్చి 'సరే' అన్నాడు.

సూపర్‌వైజర్ గొంతులో సంతోషం. ''సరే సలీం భాయ్... అతడు నిన్ను మన కన్‌స్ట్రక్షన్స్ దగ్గర కలుస్తడు. నీ ఫోన్ నెంబర్ ఇచ్చిన. సెక్యూరిటీ స్ట్రిక్ట్‌గా ఉందట. నీకు ట్రాన్‌సిట్ పర్మిషన్ ఉంది కదా. కొద్దిగా మేనేజ్ చెయ్యి. వచ్చినంక నీకు మంచి దావతిస్తా,'' అన్నాడు నవ్వుతూ.

సలీం కోపంగా పండ్లు కొరికాడు. బార్డర్ దాటుతుంటే తనకు ఎదురైన అనుభవాలు, మిత్రులు చెప్పిన విషయాలు గుర్తుకు వచ్చి ఒళ్లు జలదరించింది. భయం, జుగుప్సతో ఒక్క క్షణం వణికిపోతూ, ''కానీ.. సార్...'' అంటూ చెప్పలేక ఆగిపోయాడు.

సూపర్‌వైజర్ తెలుగువాడే. కంపెనీలో పలుకుబడి ఉన్న మనిషి. నచ్చనివాళ్లకు ఏదో తప్పును అంటగట్టి వారంలో ఉద్యోగం ఊడగొడతాడు. మంచి పేరున్న కంపెనీ. అటు దుబాయ్‌లో ఇటు మస్కట్‌లో కన్‌స్ట్రక్షన్ చేస్తుంది. మంచి శాలరీ. ఇలాంటి ఉద్యోగం దొరకడం కష్టం. అందుకని సూపర్‌వైజర్ ఏది చెప్పినా ఎదురు చెప్పరు ఎవరూ.

''ఆ సలీంభాయ్... చెప్పు... బార్డర్‌లో సెక్యూరిటీ బండిని చెక్‌చేసి క్రషర్ తిప్పుతారనే కదా... చెకింగ్‌లో దొరికినాడనుకో... నాకు తెలియకుండా బండిలో దాక్కున్నాడని చెప్పు. క్రషర్‌ను తిప్పి వదిలారనుకో... శవాన్ని ఎడారిలో పడేసిరా... బతికుంటే మాత్రం బార్డర్ దాటాక దింపేయ్. ఎవని కర్మ వానిది. మనమేం చేస్తాం,'' నవ్వుతూ అన్నాడు.

ఫోన్ కట్టయింది.

ఒక ప్రాణం గురించి అతడు తేలిగ్గా మాట్లాడుతుంటే విచిత్రమనిపించింది సలీంకు. తండ్రి గుర్తుకు వచ్చాడు. చెల్లెలు హసీనా గురించి తండ్రి అన్న మాటలు గుర్తొచ్చాయి. 'అది మనల్ని కాదని కాలు బయట పెట్టిన్నాడే చచ్చిపోయింది. దాని పేరు ఇంట్లో వినిపించ కూడదు.'

బరువుగా లేచి డ్రస్ మార్చుకుని బయటకు వచ్చాడు సలీం. షెడ్‌లోకి నడుస్తుంటే ఎస్సెమ్మెస్. ఫోన్ ఓపెన్ చేసి చూస్తే ఫాతిమా నుంచి.

'నేల రాలిన పువ్వు కోసమే దుఃఖిస్తూ కూర్చుంటే ఇక చెట్టుకు వసంతమెక్కడిది...' పూర్తిగా చదవకుండానే మూసి జేబులో వేసుకున్నాడు. సిమెంట్, ఇసుకలను కలిపే క్రషింగ్ మిషన్ రాక్షసుడి నోరులా ఉంది. బండి కండీషన్‌ను, పెట్రోల్ లెవల్‌ను చెక్ చేసుకుని కాగితాలన్నీ సరి చూసుకుని బండిని బయటకు తీసాడు.

ఎండ సుర్రుమంటుంది. వడగాలి మొదలయింది. క్యాబిన్ గ్లాస్ విండోస్ బిగించి ఫ్యాన్ వేసుకున్నాడు. పదేండ్ల నుంచి తన చేతుల్లో నడుస్తున్న బండి. ఎడారిలో రాత్రి పగలు తన దగ్గరి నేస్తం. ఎవరితో చెప్పుకోని విషయాలెన్నో దీనితో చెప్పుకున్నాడు. గేరును మార్చి ఎక్స్‌లేటర్ నొక్కి స్పీడ్‌ను పెంచుతుండగా ఫోన్ మోగింది.

చూస్తే అన్‌నోన్ నెంబర్. ఎత్తకుండానే ముందుకు సాగాడు. మళ్లీ మోగింది. ఎత్తలేదు. మళ్లీ మోగింది. ఏపి నుంచి వచ్చి ఎడారిలో మోసపోయిన కొందరు సహాయం కోసం అప్పుడప్పుడు ఫోన్ చేస్తుంటారు. శవం పంపించాలనో, కంపెనీ మోసం చేసిందనో, ఎంబసీ స్పందించడం లేదనో మొరపెట్టుకుంటారు.

మళ్లీ మళ్లీ మోగేసరికి విసుగ్గా ఫోన్ ఎత్తాడు సలీం.

''సలీంగారా... మాట్లాడేది?''

''అవును... ఎవరు?''

''సార్... నమస్తే! మీ నెంబర్ వేణుగోపాల్ సూపర్ వైజర్ ఇచ్చిండు. ఇప్పుడు నేను మస్కట్‌లో ఉన్న. మిమ్మల్ని ఎక్కడ కలవాలె,'' అతని గొంతులో భయం ఉంది.

''సాయంత్రం ఆరు గంటలకు మా కన్‌స్ట్రక్షన్ దగ్గరికి రా...'' చెప్పి పెట్టేయబోయాడు సలీం.

''సార్... ఆరుగంటలకు చెకింగ్ ఉంటది సార్. పక్కనే మజీదు ఉంది. బల్దియా వాళ్లు చెక్‌చేసి పట్టుకుంటరు. ఏడుగంటలకు వస్త సార్...'' గొంతు దీనంగా ఉంది.

'వీని దగ్గర ఎంత తీసుకున్నడో వేనుగాడు. ఇదో బిజినెస్ అయిపోయింది. కూసున్నకాడికి డబ్బులు నడిచి వస్తున్నయి. పాపపు ముండకొడుకు,' అనుకున్నాడు సలీం.

బయటి వ్యక్తి ఏమనుకున్నాడో ఏమో భయంగా, ''సార్... కొద్దిగా దయ జూడండి సార్. దుబాయికి వస్తేనే నేను ఇండియా పోగలను. పాస్‌పోర్ట్ అక్కడనే ఉంది. కావాలంటే మీకూ కొన్ని దినారులిస్త...'' బతిమాలడం మొదలుపెట్టాడు.

సలీంకు జాలివేసింది. ''సరే.. సరే.. నాకు దినార్లు వద్దు. రియాళ్లు వద్దు. ఏడుగంటలకల్లా వచ్చేయ్, తర్వాత వస్తే నేనుండను. నీ ఇష్టం,'' అంటూ ఫోన్ పెట్టేయబోతూ ఆగి పేరు అడిగాడు సలీం.

''శంకర్...'' చెప్పాడు ఆ వ్యక్తి.

''శంకర్...?'' సలీం నుదురు ముడిపడింది.

బయటి వ్యక్తిలో ఆశ మొదలయింది. ''అవును సార్... నల్లవెల్లి శంకర్.. రామాజిపేట,'' అన్నాడు ఆతృతగా.

సలీం తల గిర్రున తిరిగింది. వెంటనే బండిని స్లో చేసి రోడ్డు పక్కన ఆపాడు.

''రామాజిపేట అంటే పెద్దలింగాపూర్ దగ్గర కదూ... ఇల్లంత కుంట మండలం,'' విస్మయంగా అడిగాడు.

''అవును సార్... అదే. మా వూరు ఫేమస్... అక్కడో పెద్ద గుడి ఉంటది...'' ఇంకేదో చెబుతున్నాడు. అతడి గొంతులో ఓ పరిచయస్తుడు దొరికిన ఆనందం ఉంది.

''సరే... అక్కడికి వచ్చెయ్,'' అని ఫోన్ కట్ చేసి ఆలోచనలో పడ్డాడు సలీం. 'పోదునా వద్దా,' అన్న సంశయం మొదలయింది. సూపర్‌వైజర్ గుర్తొచ్చి వెళ్లాలనిపిస్తుంది. శంకర్ గుర్తొచ్చి వద్దనిపిస్తుంది. ఆలోచిస్తుంటే కసితో కోపం పెరిగిపోతోంది. పిడికిళ్లు బిగుసుకుంటున్నాయి. వెళ్లాలని దృఢంగా అనుకున్నాక సెల్ ఫోన్ తీసి మెసేజ్ టైప్ చేశాడు.

'ఏ జుమ్మేకి రాత్ మే మై ఏక్ అచ్చా కాం కరూంగా.'

క్షణాల్లో మెసేజ్ ఫాతిమాను చేరింది. అంత వేగంతో, 'మంచి పనే అయితే నిర్భయంగా చెయ్యి,' అన్న రిప్లయి వచ్చింది.

'మంచి పనే... హసీనా బతుకును నాశనం చేసిన వాన్ని చంపడం మంచిపనే కదా,' అనుకుంటూ బండిని ముందుకు ఉరికించాడు. తన ఏకైక లక్ష్యం అదే అన్నట్టుగా సాగిపోతోంది మిక్చర్ బండి.

గుట్టలు, ఎడారులు, ఇసుక దిబ్బలు, ముళ్ల కంచెలు, చెక్‌పోస్టులు, సెర్చిలైట్లు దాటుకుని మస్కట్‌లోకి అడుగుపెట్టింది బండి. అప్పటికి మధ్యాహ్నం దాటింది. పగలు కావడంతో పెద్దగా చెకింగ్ లేదు.

రాత్రి ఏడు ఎప్పుడవుతుందా అని ఎదురు చూశాడు సలీం.

ఏడు కంటే ముందే వచ్చాడు శంకర్. దాక్కుంటూ దాక్కుంటూ సలీంను చేరుకున్నాడు. ఫోటోను తప్ప శంకర్‌ను చూడలేదు సలీం ఇంతకుముందు. ఫోటోకు మనిషికి పోలికేలేదు. సన్నగా, పొడుగ్గా పెరిగిన గడ్డం, జుట్టుతో పిచ్చివాడిలా వున్నాడు.

'వీడ్నేనా... హసీనా పెళ్లి చేసుకుంది. వీడిలో ఏం చూసింది?' అనుకున్నాడు. శంకర్ వచ్చి వంగి వంగి నమస్కరించి చేతులు కట్టుకుని నిలబడ్డాడు. అతని రూపం చూస్తే ఒక్క క్షణం జాలివేసింది సలీంకు. వెంటనే ఆవేశం ముంచుకొచ్చింది. తీక్షణంగా చూశాడు. ఆ చూపుకు శంకర్ క్షణంపాటు వణికిపోయాడు.

''ఎన్ని సంవత్సరాలయింది వచ్చి,'' పరిశీలనగా చూస్తూ అడిగాడు.

''మూడేళ్లయింది సార్... ముందుగా దుబాయ్ వచ్చాను. రెండేళ్లు అక్క డున్నాను. కంపెనీ సరిగా జీతం ఇయ్యలేదు. కల్లివెల్లి (అల్లకల్లోలమై) అయ్యి, బయట పని చూసుకున్నాను. సరిగా పనిదొరకలేదు. ఒక మిత్రుడు మస్కట్‌లో పని ఉందంటే ఇక్కడికి వచ్చాను. ఏడాది గడిచినా పని దొరకలేదు. పాస్‌పోర్ట్ కంపెనీలోనే ఉంది. అది తీసుకుని ఇంటికి పోదామనుకుంటున్నాను,'' చెప్పాడు శంకర్.

''దుబాయ్ నుంచి మస్కట్ ఎలా వచ్చావు?'' అడిగాడు సలీం.

''అది గుర్తుకు వస్తే ఇప్పటికీ వణుకు పుడుతుంది సార్... కట్టుబట్టలతో రెండే రెండు నీళ్ల సీసాలతో ఎడారిలో ఇరవై గంటలు నడిచాను. మేం పదిమందిమి బయలుదేరితే ఐదుగురమే బార్డర్ వరకు చేరుకున్నాం. మిగతా ఐదుగురు దారిలోనే చచ్చిపోయిండ్రు. తీరా ఇనుపకంచె దాటబోతుంటే పోలీసులు కాల్పులు జరిపిండ్రు. ఇద్దరు అక్కడికక్కడే చచ్చిపోయిండ్రు. ముగ్గురం మాత్రం వెనక్కి పరుగెత్తుకొచ్చినం. అందులో ఇద్దరమే మిగిలినం...'' ఆ భయం తాలూకు వణుకు పుట్టినట్టుంది. క్షణం ఆగి గొంతు సవరించుకుని చెప్పడం మొదలెట్టాడు శంకర్.

''తర్వాత... డబ్బు ఇచ్చి ఒక అరబ్బును పట్టుకున్నాను. నాకు బురాఖా కప్పి కాళ్లకు గొలుసులు పెట్టి వేళ్లకు మట్టెలుపెట్టి కారులో కూర్చోబెట్టుకుని బార్డర్ దాటించిండు,'' చెప్పాడు శంకర్. అతని గొంతు జీరబోయింది.

ఇద్దరూ బండి వద్దకు నడిచారు.

''పెళ్లయిందా...?'' అడిగాడు సలీం.

'అయింది పోయింది. ఇప్పుడు వెళ్లగానే మళ్లీ చేసుకోవాలె,'' చెప్పాడు శంకర్.

సలీం కోపాన్ని బిగబట్టుకున్నాడు. ఎక్కువ వివరాలు అడగాలనిపించలేదు. ''పాస్‌పోర్ట్ నీ చేతికి రావడం అంత తేలిక కాదు గదా. ఇప్పటికే నీ మీద కేసు పెట్టి ఉంటారు. ఇండియా ఎలా వెళ్తావ్,'' అడిగాడు.

'ఇక్కడి కంటే దుబాయ్ నయం సార్... అక్కడ పోలీసులకు దొరికిపోయి జైలుకెళ్తాను. ఫైనుకట్టి ఇంటికి పోతాను,'' చెప్పాడు శంకర్.

''బార్డర్ దగ్గరనే దొరికిపోతే ఎలా...?'' అడిగాడు సలీం. అయోమయంగా చూశాడు శంకర్. చెప్పాలా వద్దా అన్నట్టుగా కొద్దిసేపు సందేహించి, ''ఎవరూ పట్టుకోకుండా బార్డర్ దాటిస్తానని వేణుగోపాల్ సార్ డబ్బు తీసుకున్నడు గదా!'' అన్నాడు.

చాలాసార్లు ఎంతోమందికి తనే ధైర్యం చెప్పి బార్డర్ దాటించాడు. కొందరికైతే తనే డబ్బు ఇచ్చాడు. కొందరి అడ్రస్‌లు తీసుకుని రంజాన్ రోజుల్లో తన బాస్‌తో ఫైన్ కట్టించి ఇండియా పంపాడు. ఇప్పుడు శంకర్‌ను మాత్రం భయపెట్టాలనిపిస్తున్నది సలీంకు.

''బార్డర్‌లో చెకింగ్ స్ట్రిక్ట్‌గా ఉంది. వచ్చేప్పుడు రెండు చోట్ల చెప్పినా వినకుండా మిషన్ స్టార్ట్ చేసారు,'' అన్నాడు సలీం.

శంకర్ వణికిపోయాడు. ''కానీ.. వేణు...'' అంటూ నసిగాడు.

''సరేలే.. నేను మేనేజ్ చేస్తాను. ఎక్కి డ్రమ్‌లో కూర్చో... బ్లేడ్ మొన్ననే మార్చా... గుచ్చుకుంటాయి జాగ్రత్త,'' అంటూ కేబిన్ ఎక్కి క్రషింగ్ డ్రమ్‌ను కిందికి దింపాడు సలీం.

శంకర్ భయం భయంగా డ్రమ్ ఎక్కాడు. అంతవరకు సిమెంట్ కంకర కలపడం చేత తడిగా జిగురుగా ఉంది. లోపలికి దిగబోతుంటే పిలిచాడు సలీం. ఏమిటన్నట్టు చూసాడు శంకర్.

''సెల్ స్విచ్చాఫ్‌లో పెట్టకు. సైలెంట్ మోడ్‌లో పెట్టు,'' చెప్పాడు సలీం.

'ఎవరైనా స్విచ్చాఫ్ చేయమంటారు, ఇతను సైలెంట్ మోడ్ అంటాడేమిటి... చెకింగ్ చేసేప్పుడు వెలుతురు కనిపించినా దొరికిపోతాను కదా,' అనుకుంటూ 'సరె' అన్నాడు శంకర్.

సలీం బండి స్టార్ట్ చేసాడు. గాలి కూడా సరిగ్గా అందని క్రషింగ్ డ్రమ్‌లో బ్లేడ్‌ల మధ్య కూర్చున్నాడు శంకర్. రెండు కుదుపులతో బండి వేగాన్ని అందుకుంది. రోడ్డు వెంట పట్టపగలును మరిపించే రీతిలో నియాన్ లైట్లు. ఎప్పుడో ఒకటి రెండు తప్ప వాహనాలు లేవు.

ప్రాణాలను అరచేతిలో పట్టుకుని గోడకు కరుచుకున్న బల్లిలా డ్రమ్మును హత్తుకుని పడుకున్నాడు శంకర్. హసీనాను గుర్తుచేసుకుంటూ ఆలోచిస్తూ నడుపుతున్నాడు సలీం. చేతికి అందేంత దూరంలో నాలుగు రంగుల్లో నాలుగు బటన్‌లు. ఒకటి లెఫ్ట్ టర్నింగ్. ఒకటి రైట్ టర్నింగ్. ఒకటి లిఫ్టింగ్. ఇంకొకటి క్రషింగ్. క్రషింగ్ బటన్ నొక్కితే చాలు, బ్లేడ్ గిరగిరా తిరుగుతుంది. రెండే రెండు నిమిషాల్లో మాంసం ముద్ద బయటకు వస్తుంది.

అరగంట గడిచింది. బండి సెక్యూరిటీ జోన్‌లోకి అడుగుపెట్టింది. దూరంగా సెర్చిలైట్. ఇనుపకంచెకు అక్కడక్కడా నియాన్‌లైట్లు, చెక్‌పోస్టుల రెడ్ సింబల్స్. పెట్రోలింగ్ పార్టీ హారన్ మోత. రోడ్డుకు ఇరువైపులా తప్ప అంతా చీకటి. వడగాలి తగ్గి చలిగాలి మొదలయింది.

బండిని స్లో చేసి పక్కన ఆపి సెల్‌ఫోన్ తీశాడు సలీం.

''శంకర్... ఎలా ఉన్నావు?'' అడిగాడు సలీం.

''పూర్తిగా తడిసిపోయిన సార్. ముక్కులో నోట్లో అంతా సిమెంటే. గాలి కూడా ఆడడం లేదు. కదిలితే బ్లేడ్‌లు గుచ్చుకుంటున్నాయి. బండి ఆపేసారేం సార్...''

"నీకో విషయం చెబుదామని."

"ఏమిటి సార్..."

"మనం అరగంట కూడా ప్రయాణించలేదు. ఇంకా మూడు నాలుగు గంటలు ప్రయాణించాలి."

"అమ్మో... అలాగా సార్. ఇందులో నాకు క్షణ మొక యుగంలా ఉంది..."

"అలాగే ఉంటుంది.. నీకో విషయం చెప్పాలి."

"ఏమిటి సార్..' ఎక్కడో లోతుల్లోంచి వస్తున్నట్టు బలహీనంగా ఉంది శంకర్ గొంతు.

"అదే.. నీ పెళ్లి గురించి. నువ్వో ముస్లిం అమ్మా యిని ప్రేమించి పెళ్లి చేసుకున్నావు. ఏడాది తిరక్కుం డానే ఆమెను ఇంట్లోంచి తరిమేసి గల్ఫ్‌లో వచ్చి పడ్డావు. ఆమె అన్న నీకోసం దుబాయ్‌లో వెదుకుతున్నాడని తెలిసి మస్కట్ పారిపోయావు. ఇప్పుడు ఆ అమ్మాయి ఉరిపెట్టుకుని చనిపోయిందని తెలిసి ఇంటికి పోవా లనుకుంటున్నావు. అవునా...?" కసిగా అడిగాడు సలీం.

సమాధానం లేదు.

సలీం పెదవులపై క్రోధంతో కూడిన నవ్వు మెరి సింది. ఈ మాటలు విన్న తర్వాత అతడి ముఖం ఎలా ఉంటుందో చూడాలనిపించింది. టెన్షన్‌తో భయంతో అతడు బిగుసుకుపోతుంటే చూసి నవ్వాలనిపించింది.

"ఏంరా... చెప్పవూ... నిజమా కాదా...?" రెట్టించి అడిగాడు సలీం.

శంకర్‌కు పరిస్థితి పూర్తిగా అర్థమైంది. భయంతో గొంతులో వణుకు, ఎగపోత పుట్టింది. బలవంతంగా శరీరాన్ని ఆధీనంలోకి తెచ్చుకుంటూ, "సలీం... అంటే మీరు హసీనాకు అన్న కదూ," అన్నాడు.

"అవున్రా... నీ కొరకు వెదికి వేసారిన సలీంను. నా చెల్లెలు బతికి ఉన్నప్పుడు కలిస్తే నీ కాళ్లు పట్టుకుని బతిమాలేవాన్ని. నువ్వు ఏది అడిగినా చివరికి నా ప్రాణ మడిగినా ఇచ్చేవాన్ని. కానీ కానికాలంలో పులిబోనులో కాలుపెట్టావు కదరా..." అన్నాడు కోపంగా.

శంకర్ మాట్లాడలేదు.

"ఏంరా... మాట్లాడవు. అవునా కాదా...?" బండి స్టార్ట్ చేస్తూ అన్నాడు సలీం.

"సార్... నన్ను క్షమించండి సార్... చేసిన తప్పుకు మూడేండ్లు అష్టకష్టాలు పడ్డాను. హోటల్‌లో క్లీనింగ్ పని అంటే అప్పు చేసి వచ్చిన. ఇక్కడికి వచ్చినంక ఎర్రటి ఎండలో గొర్ల దగ్గర కాపల ఉంచిండ్రు. ఇదేమిటని అడిగినందుకే జీతం ఇయ్యలేదు. తిండి దొరకక అడు క్కుతిన్న. డబ్బులు ఎక్కువిస్తనంటే సెప్టిక్ టాంక్‌లు ఎత్తి పోసిన. తీరా పైసలడిగితే పోలీసులకు పట్టిస్తమని బెది రించిండ్రు... ఒకనాడైతే ఇద్దరం సెప్టిక్ టాంక్ ఎత్తిపో స్తున్నం. పోలీసులు వస్తే వాడు నిచ్చెన తీసుకుని పారిపో యిండు. నేను రెండు రోజులు అందులోనే ఉన్న...' ఏడుస్తున్నట్టున్నాడు. గొంతు తడబడుతుంది. ఇంకా ఏదో చెప్పుకుపోతున్నాడు.

"నీకు సరియైన శిక్ష చావు ఒక్కటే... క్రషింగ్ రూలర్ బటన్ నా కుడిచేతికి అందుబాటులోనే ఉంది. ఏ క్షణంలో నొక్కుతానో తెలియదు. గుడ్ బై..." ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు సలీం. కోపంతో వెన్నువిరిచి కాళ్లు నిగ్ర దొక్కితే ఎక్సలేటర్ మరింత నొక్కబడి బండి దడదడ మంటూ రెట్టింపు వేగాన్ని అందుకుంది.

అవి పున్నమకు ముందురోజులు. సగం కోసిన వెన్నముద్దలా చంద్రుడు ఇసుక గుట్టల్లో తేలి పైపైకి వస్తున్నాడు. శంకర్‌ను ఊహించుకుంటూ సలీం బండి నడుపుతున్నాడు. ఈదురుగాలి ఇసుక బొరియల గుండా ప్రయాణిస్తూ జుయ్యిమంటుంది. ఎడారి పంది కొక్కులు బొరియల్లోంచి బయటకు వచ్చి రోడ్డుకు అడ్డంగా పరుగెత్తుతున్నాయి.

సలీం ఆలోచనల నిండా శంకర్ ఉన్నాడు. ఆ క్షణంలో అతని మానసికస్థితి ఎలా ఉందో ఊహించు కుంటున్నాడు.

'ఒకవేళ భయంతో గుండె ఆగి చనిపోలేదు కదా...' అన్న అనుమానం వచ్చింది. ఆ అనుమానం రాగానే కొంత జాలిగా అనిపించింది.

'పెళ్లి చేసుకున్న తర్వాత హసీనా చాలాసార్లు ఫోన్ చేసింది. అడగ్గా అడగ్గా ఒక్కసారి మాత్రమే ఇద్దరి ఫోటో పెట్టింది. ఆ ఫోటోలో వీడు వీడిలా లేడు. వీడు ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఒక్కసారి కూడా నాకు చెప్పలేదు. ఎన్నిసార్లు ఇండియా పోవాలి అనుకున్నా అబ్బా భయా నికి పోలేదు. మధ్యలో ఒక్కసారి వెళ్లినా కొంత ఓదార్పు దొరికి బతికి ఉండునేమో,' అనుకున్నాడు.

కోపంగా కుడిచెయ్యి లేచింది. క్రషింగ్ బటన్ వైపు ఎంత వేగంగా వెళ్లిందో అంతే వేగంగా కిందికి దిగింది. బటన్ నొక్కడానికి మనసు ఒప్పడం లేదు. మరింత కోపం పుట్టడానికి అతనిపై మనసునిండా ద్వేషాన్ని నింపుకున్నాడు. కాని ఎంతగా ద్వేషించాలనుకున్నా ఏ మూలనో దాక్కున్న జాలి గుండెను కుదిపేస్తున్నది. తను చాలాసార్లు బార్డర్ దాటించిన వ్యక్తుల్లా శంకర్ కూడా తన మనసును అతలాకుతలం చేస్తున్నాడు. అతడు

చెప్పిన కష్టాలే గుర్తుకు వస్తున్నాయి. అవి ఇంతకు ముందు విన్న కష్టాలకంటే భిన్నంగా ఉన్నాయి.

ఆలోచిస్తుంటే వైరాగ్యం పుడుతోంది సలీంకు.

'అల్లా ఎవరికి ఎలా జరగాలో అలా రాసి పెడ తాడు. మన చేతుల్లో ఏముంది...? హసీనాకు అంతే బతుకు రాసినట్టున్నాడు. వాడైనా నేనైనా నిమిత్తమాత్రులమే,' అనుకున్నాడు.

అలా అనుకుంటే గుండె బరువు తగ్గింది.

బటన్ నొక్కాలా వద్దా అని ఒకటికి పదిసార్లు ఆలోచిస్తున్నాడు. మొదటిసారి ఉన్నంత కోపం లేదు. క్రమక్రమంగా మనసునిండా వైరాగ్యం ఆవరిస్తోంది. అప్పటికి బండి సెక్యూరిటీ జోన్‌లోకి వచ్చింది. పావు కిలోమీటరుకో చెక్‌పోస్ట్. ప్రతి చెక్‌పోస్ట్‌కు గద్దరెక్కల్లా వాహనం రాగానే రోడ్డుకు అడ్డంగా వాలుతున్న సైడ్ పోల్స్.

ఆగిన ప్రతిచోట, 'సలామాలేకుం' అంటూ 'బతాకా' చూపిస్తున్నాడు సలీం. సెక్యూరిటీ ఒకసారి బండిని పరిశీలించి నెంబర్ నోట్ చేసుకుని పంపుతున్నాడు.

సెక్యూరిటీ బండిని సమీపిస్తున్నప్పుడల్లా గుండె వేగం పెరుగుతోంది. ఎంత కాదనుకున్నా కడుపులో కార్యం కదులుతుంది.

'వీడు నా చెల్లెల్ని చంపినవాడు. వీడు బతక్కూడదు,' అనుకుంటున్నాడు. కాని వెనువెంటనే ఎన్నో ప్రశ్నలు. చంపితే మాత్రం చెల్లెలు బతికి వస్తుందా అని...!

రోడ్డు ఎత్తైన గుట్టలను చుట్టి ఇసుక వాలుల నుంచి సాగుతోంది. దూరంగా గుట్టచాటు నుంచి ఒక గుంపు మసక వెన్నెల్లో నక్కినక్కిపోతోంది.

గుంపు వైపు జాలిగా చూస్తూ, 'ఈ రాత్రి ఏ కన్న తల్లి పేగు కాలుతుందో...' అనుకున్నాడు. అనుకుంటుండగానే చిన్నగా కేక. చావు తప్పదని తెలిశాక భయంతో మనిషి వేసిన కేక. అలాంటి కేకలను విన్నప్పుడల్లా సలీం కడుపుల పేగులు కదులు తాయి.

'వీడిని చంపడం కాదు... సెక్యూరిటీకి పట్టిస్తే సరి. పదేళ్లు జైలులో ఉంటాడు రోజూ చస్తూ...' అనుకున్నాడు. అలా అనుకున్నాక మనసు కొద్ది కొద్దిగా తేలికయింది.

ఎక్కడో సుడిగాలి పుట్టినట్టుంది. సన్నటి ఇసుక దుమ్ములా లేస్తుంది. సలీం గేరు మార్చి వేగాన్ని పెంచాడు. బండి క్లోజ్డ్ సర్క్యూట్ జోన్‌లోకి అడుగు పెట్టింది. ఇటు మూడు అటు మూడు ఆరు కిలోమీటర్లు. సాయుధ కమెండోలు గస్తీ తిరుగుతున్నారు. హై పవర్ సెర్చిలైట్లు చుట్టూ తిరుగుతున్నాయి. సైనిక గుడారాల మీద ఎర్రలైటు వెలుగుతోంది. ఎక్కడో తుపాకి మోతలు వినబడ్డాయి.

బార్డర్ లైన్ దగ్గరవుతుంటే వాతావరణంలో ఏదో మార్పు. సైనికుల జీబులు అటూ ఇటూ తిరుగుతున్నాయి. బెదిరిన చీమల పుట్టలా సైనికులు హడావుడిగా ఉన్నారు. ఏం జరిగిందో తెలియదు కానీ ఏదో జరిగిందని మాత్రం తెలిసిపోతోంది సలీంకు. అప్పుడప్పుడు ఇలా హై అలర్ట్ మామూలే. అప్పుడు మాత్రం ప్రతి బండిని పూర్తిగా చెక్ చేయకుండా వదలరు.

అప్రయత్నంగా బండిని స్లో చేశాడు సలీం. రెండు వారాల కింద నిజామాబాద్ డ్రైవర్ రాములు చెప్పిన సంగతి గుర్తుకు వచ్చింది. రాములు కన్‌స్ట్రక్షన్ దగ్గరికి నీళ్ల ట్యాంక్ నడుపుతాడు. అల్లుడిని ఖాళీ టాంకర్‌లో దాక్కోబెట్టి బార్డర్ దాటుతున్నాడట. ఎన్నడూ లేనిది హై అలర్ట్‌గా ఉందట. ట్యాంకర్‌లో ఏమీలేదని చెప్పినా వినకుండా పెట్రోల్ పోసి అగ్గిపుల్ల వేశారట.

'నా కూతురు జీవితానికి నేనే నిప్పు పెట్టాను రా... వాన్ని ఈ చేతులతోనే ఎడారిలో పాతిపెట్టాను,' అంటూ రాములు ఏడ్వడం గుర్తొచ్చింది. ఒక్క రాములుదే కాదు, గుండెను పిండేసిన మరెన్నో ఏడ్పులు గుర్తొచ్చాయి.

వెంటనే తల విదిలించి కిందికి దిగాడు సలీం. సెల్ లైట్ ఆన్ చేసి కావలసిన వైర్లను కట్ చేశాడు. ఒక్కొక్క వైరు తెగిపోతుంటే గుండెను గట్టిగా చుట్టేసిన ఏవో తాళ్లు తెగుతున్నట్టుగా అనిపించింది. అంతవరకూ ఉన్న ఊగిసలాట, ఆందోళన, అస్థిమితం మెల్లగా మాయమైపోయాయి.

సిగరెట్ వెలిగించి గట్టిగా దమ్ము లాగి మళ్లీ బండి ఎక్కాడు సలీం. పది నిమిషాల్లో బండి బార్డర్ లైన్ మీద ఉంది. సైనికులు వేటకుక్కల్లా పరుగెత్తుకొచ్చారు. బండి చుట్టూ తిరిగారు. కాగితాలను చెక్ చేశారు.

ఎంత మామూలుగా ఉందామన్నా ఎక్కడో కొంత ఉద్వేగం. అది ఉచ్ఛ్వాస నిశ్వాసల్లో బయటపడుతుంది. గుండె దడదడ కొట్టుకుంటుంది.

"వో చక్కర్ మషినీకో ఆన్ కరో..." ఆర్డర్ చేశాడు కమాండర్.

సలీం బటన్ నొక్కుతూ, "వో ఖరాబ్ హోగయా సాబ్... మెకానిక్‌కే పాస్ జారహాహూ..." అన్నాడు.

"అందర్ క్యా హై..." గర్జించాడు డ్రమ్‌ను చూపిస్తూ.

"కుచ్ బీ నహీ... సిమెంట్, కాంక్రీట్... సైట్ నజ్దీక్ హై," అంటూ కంపెనీ పేరు చెప్పాడు.

"చల్... జావో..." అన్నాడు. బండి ముందుకు కదిలింది. గంటవరకూ ఎక్కడా ఆగలేదు. ఆల్ జీన్ రా ఇసుక గుట్టలు దాటాక బండిని ఆపాడు సలీం. అప్పటికి అర్ధరాత్రి దాటింది. దూరంగా అక్కడక్కడా నియాన్ లైట్లు కనిపిస్తున్నాయి. పైకి ఎక్కి డ్రమ్మును బలవంతంగా ముందుకు తిప్పాడు. పట్టు తప్పి గోడ మీద నుంచి రాలిన బల్లిలా కిందపడ్డాడు శంకర్.

అతడిలో చలనం లేదు.

బండితో కొంత దూరం వచ్చి వెనక్కి తిరిగి చూశాడు సలీం. మసక వెన్నెల్లో ముండ్ల పొదలను, తుప్పలను లెక్కచేయకుండా పరుగెత్తుతున్నాడు శంకర్. సెల్‌ఫోన్ తీసి రింగ్ చేశాడు. శంకర్ ఎత్తడం లేదు.

"నాకు తెలుసురా... నువ్వు చావలేదని... పోరా పో... బతుకు పో," బిగ్గరగా అరిచాడు సలీం. ఎప్పుడు పంపిందో ఫాతిమా, 'ఓ అచ్ఛీకామ్... క్యా హై,' అన్న మెసేజ్ ఇన్‌బాక్స్‌లో ఉంది.

*గల్ఫ్ బాధితుల తరపున ఒంటరి పోరాటం చేస్తున్న మిత్రులు నారాయణస్వామిగార్కి...*

***ఆదివారం ఆంధ్రజ్యోతి, 2 డిసెంబర్ 2012***

